బడంగ్‌పేట.. 'అవిశ్వాసం'పై
ఊగిసలాట..!

- బీజేపీ-బీఆర్ఎస్ మధ్య కుదరని సయోధ్య..?
- మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటున్న కొందరు..
- డిప్యూటీ మేయర్‌పైనా పెట్టాలని ఇంకొందరి పట్టు


పారిజాతారెడ్డి, మేయర్

సరూర్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో బీజేపీ-బీఆర్ఎస్‌ల మధ్య చిగురిస్తున్న 'అవిశ్వాస' స్నేహబంధం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి(కాంగ్రెస్)పై అవిశ్వాసం పెట్టడానికి సదరు రెండు పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. అయితే, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ (ఇండిపెండెంట్) అంశం వారి మధ్య సయోధ్యకు అడ్డంకిగా మారుతోంది. బీజేపీ, బీఆర్ఎస్‌లోని కొందరు కార్పొరేటర్లు కేవలం మేయర్‌పైనే అవిశ్వాసం పెట్టాలని పట్టుపడుతుండగా, ఇంకొందరు కార్పొరేటర్లు మాత్రం డిప్యూటీ మేయర్‌పైనా అవిశ్వాసం పెట్టాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. ఇద్దరినీ దించేస్తే.. ఆ తర్వాత చెరో పదవి పంచుకోవచ్చునని, ఒకరినే దించేస్తే ఆ పదవిని ఎవరు తీసుకోవాలనే రచ్చ మొదలై అసలుకే ఎసరు పెడుతుందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో బడంగ్‌పేట్ అవిశ్వాసం వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

మెజారిటీ స్థానాలున్నా..

బడంగ్‌పేట్‌లో మెజారిటీ స్థానాల్లో (14) బీఆర్ఎస్ కార్పొరేటర్లే ఉన్నారు. 10 స్థానాలతో బీజేపీ రెండో స్థానంలో ఉంది. ఈ రెండు పార్టీలకు పదవిగానీ లేకపోవడం గమనార్హం! 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 32 స్థానాలకు గానూ బీఆర్ఎస్ 13, బీజేపీ 10, కాంగ్రెస్ 7 స్థానాల్లో గెలుపొందగా.. ఇద్దరు స్వతంత్రులు గెలుపొందారు. అనంతరం ఒక ఇండిపెండెంట్ బీఆర్ఎస్‌లో చేరారు. మరో ఇండిపెండెంట్ తాను బీఎస్పీ అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. మేయర్ పీఠం దక్కించుకోవడానికి అవసరమైనన్ని స్థానాలు లేకపోవడంతో అప్పట్లో మంత్రిగా ఉన్న సబితారెడ్డి.. నాదర్‌గుల్ 31వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ పారిజాతారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మేయర్ పదవి కట్టబెట్టారు. ఇక ఒకే స్థానంలో గెలిచిన బీఎస్పీ కార్పొరేటర్ ఇబ్రాం శేఖర్‌కు డిప్యూటీ మేయర్ పదవి అప్పగించారు. అప్పటిదాకా ఏదో ఒక పదవి దక్కుతుందనుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లకు నిరాశే మిగిలింది. మేయర్ పారిజాతారెడ్డి 2022 జూన్‌లో బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. అప్పటి నుంచి సబితతో సఖ్యత దూరమై తరచుగా వివాదాలకు కేంద్రంగా మారారు.


శేఖర్, డిప్యూటీ మేయర్

పదవి ఇస్తేనే అవిశ్వాసానికి సై: బీజేపీ

తమకు మేయర్ లేదా డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చేట్టయితేనే మేయర్‌పై అవిశ్వాసానికి ముందుకొస్తామని బీజేపీ అంటోంది. అయితే, సబితారెడ్డి మాత్రం డిప్యూటీ మేయర్ శేఖర్‌పై అవిశ్వాసానికి సుముఖత కనబరచడంలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సబితకు బహిరంగ మద్దతు ప్రకటించి విస్తృతంగా ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. దాంతో ఆయనను బీఎస్పీ నుంచి సస్పెండ్ కూడా చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్‌ను దూరం చేసుకునేందుకు సబిత ఆసక్తి కనబరచడం లేదని తెలిసింది. మేయర్‌పై అవిశ్వాసం పెడితే ఓకే.. డిప్యూటీ మేయర్‌ను మాత్రం టచ్ చేయొద్దు అని ఆమె ఖరాఖండీగా చెప్పినట్టు సమాచారం. దాంతో బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు అయోమయంలో పడిపోయారు. సబిత వ్యాఖ్యల నేపథ్యంలో డిప్యూటీ మేయర్‌ను ఆ పార్టీకి చెందిన అభ్యర్థిగా భావిస్తే.. తమకు మేయర్ పదవి ఇవ్వాలని బీజేపీ కోరుతోంది. ఇందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఒప్పుకోవడంలేదు. అవసరమైతే డిప్యూటీ మేయర్‌పైనా అవిశ్వాసం పెడదామని ఆ పార్టీలోని ముగ్గురు, నలుగురు సభ్యులు తమ అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య సయోధ్య కుదరడం లేదు. డిప్యూటీ మేయర్‌ను టచ్ చేయకుండా మేయర్ ఒక్కరిపైనే అవిశ్వాసం పెడితే అది నెగ్గుతుందా లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందించాలి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజలు తోడ్పాటునందించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. సరూర్‌నగర్ చెరువు కట్ట కింద ఓస్సెస్ మటన్ షాపు సమీపంలో కొనసాగుతున్న టన్నలింగ్ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయని స్పష్టం చేశారు. పనులు పూర్తయితే సరూర్‌నగర్ చెరువు లోతట్టు ప్రాంతవాసులకు వరదనీటి కష్టాల నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్, మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రమేష్‌ముదిరాజ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ రమణారెడ్డి, ప్రదీప్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేత సురేష్ తదితరులు

పెద్దఅంబర్‌పేట్ అభివృద్ధికి కృషి చేయండి

కాంగ్రెస్ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని పెద్దఅంబర్‌పేట్‌తో పాటు పసుమాముల, కుంట్లూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ మున్సిపాలిటీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్ర సురేష్, చెవుల చిరంజీవి, జోర్క శ్రీరాములు ముదిరాజ్, ఓరుగంటి కొండల్‌గౌడ్, మోతే రామలింగం తదితరులు పాల్గొన్నారు.

దీపాంతల పంపిణీ

మన్సూరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్క హిందువు తమ ఇంటి వద్ద దీపాలు వెలిగించాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని దీపాంతలను శనివారం నాగోల్‌లోని తన కార్యాలయంలో కార్పొరేటర్ భక్తులకు పంపిణీ చేశారు. ప్రాణప్రతిష్ఠ రోజున సమీపంలోని దేవాలయంలో భజన, కీర్తనలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దాల ఐలయ్య, వస్పరి మల్లేష్, శివశంకర్, మహేందర్‌రెడ్డి, రామన్‌గౌడ్, మనోజ్ పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తుల ఓట్లు ఓటరు లిస్టు నుంచి తొలగించండి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశం

హయత్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ కోరారు. శనివారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఇంజాపూర్ బూత్ నంబర్ 221ను సందర్శించారు. రానున్న ఎన్నికలను పురస్కరించుకుని ఓటరు నమోదు, తొలగింపుల కోసం రెండు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకున్నట్లు చెప్పారు. బీఎల్‌ఓలు ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటరు లిస్టులో ఉన్న చనిపోయిన వారి పేర్లు తొలగించాలని ఆదేశించారు.మరణ ధృవీకరణ పత్రం లేకుంటే ఇంటి యజమానుల నుంచి వాంగ్మూలం తీసుకుని ఓటును తొలగించాలన్నారు. ఓటరు నమోదు కోసం ఫారం-6ను నింపి ఇవ్వాలన్నారు. ఓటు తొలగింపునకు ఫాం-7ను, ఓటు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చడానికి ఫాం-8ను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కొత్తగా నమోదు చేసుకునే ఓట్లను లిస్టులో చేర్చాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. తప్పుడు ఓట్లు ఉంటే కూడా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీంద్ర దత్తు, ఆర్ఐ బిక్షపతితో పాటు పలువురు రెవిన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట మోసం

- గర్భవతిని చేసి అబార్షన్ చేయించిన ఘనుడు
- పెళ్లి ప్రస్తావన రావడంతో ముఖం చాటేసిన ప్రియునిపై కేసు నమోదు

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఓ యువతితో ఆరు నెలలపాటు సహజీవనం చేసి, ఆమె గర్భవతి కావడంతో అబార్షన్ చేయించి తనకేమీ తెలియదంటూ మోసం చేసిన యువకుడిపై సరూర్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన ఎడ్ల తరుణ్ అనే యువకుడు నాగోల్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. నాగోల్-బండ్లగూడ తట్టిఅన్నారం ప్రాంతానికి చెందిన యువతి.. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతూ 2019లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న తరుణ్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి తరుణ్ 2023ఫిబ్రవరిలో లింగోజిగూడ డివిజన్ సాయినగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని ఆరునెలల పాటు సహజీవనం చేశాడు. అదే సమయంలో ఆ యువతి గర్భం దాల్చింది. దీంతో వెంటనే తనకు తెలిసిన డాక్టర్ల ద్వారా కొత్తపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అబార్షన్ చేయించాడు. యువతి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో కులాలు వేరంటూ ఆ యువతిని దళితురాలివంటూ కులం పేరుతో దూషిస్తూ చిత్రహింసలకు గురిచేశాడు. తరుణ్ కుటుంబ సభ్యులను ఆశ్రయించగా, వారు కూడా కులం పేరిట దూషించి వెళ్లగొట్టారు. దీంతో బాధితురాలు, సామాజిక కార్యకర్తల సహాయంతో సరూర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యువతిని మోసం చేసిన తరుణ్ పై, అతని కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

తూఫాన్ ఢీ కొని .. నాలుగు వాహనాలు ధ్వంసం


తూఫాన్ వాహనం ఢీ కొట్టిన ఘటనలో ధ్వంసమైన బైకులు

కొత్తపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి హస్తినాపురం వద్ద తూఫాన్ వాహనం ఢీకొని మూడు బైకులు, ఓ కారు ధ్వంసమయ్యాయి, నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ దయాకర్‌రెడ్డి కథనం ప్రకారం... హస్తినాపురం ఊర్మిళానగర్ కాలనీలో ఉండే పోరెడ్డి నరేందర్ రెడ్డి(47), పోరెడ్డి సురేందర్‌రెడ్డి(34) ప్రైవేట్ ఉద్యోగులు. శనివారం ఉదయం 8 గంటలకు వారు బైకుపై వెళుతూ సంతోషిమాతా చౌరస్తాలో ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో ఆగారు. అదే సమయంలో ఒక తూఫాన్ వాహనం వేగంగా దూసుకు వచ్చి సిగ్నల్ ఆగి ఉన్న నరేందర్ రెడ్డి బైకును, సంగిశెట్టి కుమార్, రిచర్డ్ యాంథోనీ బైకులనూ ఢీకొట్టి ఎదురుగా ఆగి ఉన్న స్విఫ్ట్ కారునూ ఢీకొట్టింది. ఈ ఘటనలో మూడు బైకులు, కారు ధ్వంసం కాగా నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంగిశెట్టి కుమార్, రిచర్డ్ యాంథోనీలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నరేందర్‌రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు కారణమైన తూఫాన్ వాహనం డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు.

గురువుల బోధనతో ప్రగతికి బాటలు

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ చూడామణి


మహాపండితుల జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ టి.కె. చూడామణి

అల్వాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లౌకికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని పురోగతిని పొందాలంటే సద్గురువుల మార్గదర్శనం తప్పక లభించాల్సిందేనని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త డాక్టర్ టి.కె. చూడామణి అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు, ప్రచారానికి జీవితకాలం కృషి చేసిన స్వామినాథ దేశిక, శ్రీరంగ శఠకోప దేశిక, వెంకట నరసింహ దేశికుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న విశిష్ట ఉపన్యాస కార్యక్రమానికి రెండో రోజు శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ రంగంలో రాణించాలన్నా, ఆయా రంగాల్లో నిష్ణాతులైన గురువుల బోధనలను శ్రద్ధగా విని, వాటిని ఆచరించాలని, అప్పుడే ప్రగతిపథంలో పయనించగలుగుతామని చూడామణి పేర్కొన్నారు. నిర్వాహకులు సముద్రాల శఠగోపాచార్య మాట్లాడుతూ తరతరాలకు చెరగని నిధిగా విజ్ఞాన సంపదను మన పూర్వీకులైన ఆచార్యులు సమాజానికి గ్రంథస్థం చేసి సురక్షితంగా అందించారని, వాటిని అధ్యయనం చేసి ఆదర్శవంతమైన జీవనాన్ని గడపాలన్నారు. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక యువతకు అందించేందుకు తాను 15 గ్రంథాలను రచించానని, ప్రముఖ దినపత్రికలలో వ్యాసాలను రచిస్తూ కాలమిస్ట్‌గా కొనసాగుతున్నానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు రసజ్ఞులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామోజీఫిల్మ్ సిటీ ప్రమాదంపై దర్యాప్తు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగర శివారు రామోజీ ఫిల్మ్ సిటీలో గురువారం రాత్రి వెస్టేక్స్ ఏషియా కంపెనీ సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో జరిగిన ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. ఘటనలో ఆ కంపెనీ సీఈవో సంజయ్‌షా మృతి చెందగా..ప్రెసిడెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ప్రమాదానికి గల కారణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అసలు ఏరియల్ యాక్ట్ తీగలు తెగడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఈవెంట్ నిర్వహకులు నిర్లక్ష్యంపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, స్టేజీపై ఏరియల్ యాక్టు ఏర్పాటు చేసిన క్రమంలో రూఫ్ క్లాంపులను సరిగ్గా అమర్చకపోవడంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై విచారణ కోసం ఆర్అండ్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీ శాఖల అధికారులను కోరినట్లు తెలిసింది. అయితే, శుక్రవారం ఆర్అండ్‌బీ ఈ ఘటనా ప్రదేశాన్ని పరిశీలించినట్లు తెలిసింది. రెండు శాఖల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ప్రమాదానికి గలకారణాలు తెలిసే అవకాశం ఉంది.

సీఈవో మృతదేహం అప్పగింత

ప్రమాదంలో మృతి చెందిన కంపెనీ సీఈవో సంజయ్‌షా మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ప్రత్యేక కార్గో విమానంలో మృతదేహాన్ని ముంబైకి తరలించారు. ఈ ఘటనలో గాయపడిన కంపెనీ ప్రెసిడెంట్ రాజ్‌దాట్ల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి.. అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

- అధికారులకు మేయర్ పారిజాతారెడ్డి సూచన

సరూర్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అధికారులు కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. అదేవిధంగా పలు డివిజన్లలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్టు ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని అడ్డుకోవడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం తన ఛాంబర్‌లో కమిషనర్ బి.సుమన్‌రావుతో కలిసి పలు విభాగాల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ టీఎస్‌బీపాస్ అనుమతులు లేకుండా జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచించారు. వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించి, అవసరమైతే కూల్చివేతలకు రంగం సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈలు బిక్కూనాయక్, వినీల్‌గౌడ్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, టీపీఎస్ మాలప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.33లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హయత్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటి కమ్మగూడ 22వ వార్డులో రూ.33లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం స్థానిక కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశిక ఐలయ్య శంకుస్థాపన చేశారు. వార్డులోని రాజ్‌రంజిత్‌నగర్ కాలనీలో రూ.10 లక్షలతో బీటీ రోడ్డు, నవ భారత్ కాలనీ, మను అనూ ఎన్‌క్లేవ్ రూ.8లక్షలతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, ప్రగతినగర్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, న్యూప్రగతినగర్ కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ ఐలయ్య మాట్లాడుతూ 22వ వార్డులో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాలనీలలో ముందుగా డ్రైనేజీ, మంచినీరు. రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీల సంఘాల నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పర్వతరెడ్డి, మనోహర్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, మురళీ, అనంతరెడ్డి, మారుతిరావు, హనుమంతు, శంకర్, షచ్చి, రాజు నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి.. దోచుకునేందుకే వచ్చాడు

- జిల్లాలో భూముల స్కాములన్నింటీలోనూ ఆయనే పాత్రధారి
- మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం, బీజేపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి జిల్లాలో ఆస్తులు కొల్లకొట్టేందుకే వచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. జిల్లాలోని పలు భూముల కుంభకోణాలతో పాటు రాష్ట్రంలో కోళ్ల దాణా, కోడిగుడ్ల స్కామ్‌లకు ఆయనే సూత్రధారి అని ఆరోపించారు. లక్డీకాపూల్‌లో శనివారం బీజేపీ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవియాదవ్ తదితరులు మాట్లాడారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దందాలు తప్పా ఆయన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డికి స్థానిక సమస్యలపై అవగాహన లేదని అన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మాత్రమే ఆయనకు తెలుసని విమర్శించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన ఫామ్‌హౌస్‌కు మాత్రం కొత్త రోడ్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూముల కుంభకోణాలతో పాటు ఫిల్మ్‌నగర్‌లో రూ.వందల కోట్ల దేవాలయ భూములు కొల్లకొట్టిన వ్యవహారంలో కూడా రంజిత్‌రెడ్డే సూత్రధారి అని విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ శివార్లలో అనేక భూదందాలు చేశారని, వీటన్నింటిపై తాము విచారణ కోరతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరి వల్లే హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులు నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోతే ఎంపీ రంజిత్‌రెడ్డి ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత అసమర్థ ఎంపీని ఎక్కడా చూడలేదన్నారు. శంకరపల్లిలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగితే ఆయన ఎక్కడున్నారన్నారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేస్తాం

ఎంపీ రంజిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని వారు హితవు పలికారు. లేదంటే తగిన శాస్తి చేయాల్సి ఉంటుందని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఇటీవల మాజీ ఎంపీ విశ్వేశ్వరరెడ్డిపై రంజిత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రెండు రోజుల కిందట ఒక గ్రామ సర్పంచ్‌కి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ఫోన్ చేసి తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితే బీజేపీలోకి రావాలని కోరారని చెప్పారు. దీనిపై రంజిత్‌రెడ్డి స్పందించిన తీరు సిగ్గుచేటన్నారు. డబ్బు, హోదాను చూసి అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పరిగి నేత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు

ఎల్బీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ప్రత్యేక ఓటరు శిబిరాలు ప్రారంభించారు. శని, ఆదివారాలలో పనిచేసే ఈ ప్రత్యేక ఓటరు శిబిరాలలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం వేర్వేరు దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత పోలింగ్ కేంద్రం ముసాయిదా ఓటరు జాబితాతో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండనున్నారు. ఈ కేంద్రాలలో కొత్త ఓటరు దరఖాస్తుతో పాటు సవరణలకు, ఫోన్ నంబర్లు చేర్చడం వంటి సేవలు పొందవచ్చని ఎల్బీనగర్ ఈఆర్ఓ రవీందర్‌కుమార్ తెలిపారు.

జేఎన్‌టీయూ స్టార్టప్‌కు రూ.2కోట్ల ఫండింగ్

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత డ్రగ్ డిస్కవరీపై సెంటెల్లా పేరుతో స్టార్టప్‌ను రూపొందించిన జేఎన్‌టీయూ విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. సెంటెల్లా స్టార్టప్ పురోగతి కోసమని అమెరికాలోని ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ నుంచి రూ.2కోట్ల ఫండింగ్ లభించింది. రెండేళ్లుగా జె-హబ్‌లో సెంటెల్లా స్టార్టప్‌పై కృషిచేసిన రియాజ్ సయ్యద్‌ను వైస్‌చాన్స్‌లర్ నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, డైరెక్టర్ శ్రీదేవి అభినందించారు. సయ్యద్ రియాజ్ మాట్లాడుతూ.. తమ స్టార్టప్‌కు ఇంతటి గుర్తింపు రావడంలో జె-హబ్ డైరెక్టర్, యూనివర్సిటీ ఉన్నతాధికారులు అందించిన సహకారం ఎంతో ఉందన్నారు.

మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా కాశీవిశ్వనాథ్


కాశీవిశ్వనాథ్, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్

సరూర్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.కాశీవిశ్వనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మంచాల ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆయనను ఇక్కడకు బదిలీ చేసిన ఉన్నతాధికారులు.. ఇక్కడ పని చేసిన కిరణ్‌కుమార్‌ను సైబర్ క్రైమ్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో పాత ఇన్‌స్పెక్టర్ శుక్రవారమే రిలీవ్‌కాగా, కొత్త ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నేతలు, కాలనీల ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


దీపాదాస్ మున్షీతో కట్ల నర్సింహ్మాయాదవ్

దీపామున్షీని కలిసిన 'కట్ల'

వనస్థలిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జిగా నియమితులైన దీపాదాస్ మున్షీని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ల నర్సింహ్మాయాదవ్ మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు.